సాక్షి విశాఖపట్నం

గురువారం, 12, అక్టోబర్, 2023



త్రోబాల్ పోటీలకు ఎంపిక

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అండర్ - 17 బాలబాలికల త్రోబాల్ పోటీల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది 8లో



పలు రైళ్ల రద్దు

విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేశారు. 8లో

మారుతీనగర్‌లో భారీ చోరీ



మారుతీనగర్‌లో నూతనంగా నిర్మించిన ఎంవీవీ సత్య హోమ్స్‌లో రూ.25 లక్షల విలువ చేసే వజ్రాలు, బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. 8లో

న్యూస్‌రీల్

విశాఖ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటాలి



భరత్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య : విశాఖ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటేలా నగరానికి చెందిన క్రీడాకారులు కృషి చేయాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. భారత టెస్టు క్రికెట్ జట్టుకు వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తున్న ఆంధ్ర రంజీ టీం కెప్టెన్ కోనా శ్రీకర్ భరత్‌ను బుధవారం డిప్యూటీ మేయర్ శ్రీధర్ ఘనంగా సన్మానించారు. తన చాంబర్‌కు విచ్చేసిన శ్రీకర్ భరత్‌కు మర్యాద పూర్వక స్వాగతం పలికిన డిప్యూటీ మేయర్ శ్రీధర్ ఈ సందర్భంగా శాలువుతో సత్కరించారు. విశాఖ వాసులంతా గర్వపడేలా భారత క్రికెట్ జట్టులో కీలక పాత్ర పోషిస్తున్న శ్రీకర్ భరత్ భవిష్యత్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పవన్ కార్తీక్, 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఆర్ మూక్స్ కోర్సులకు 3,500 దరఖాస్తులు



కోర్సు ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ – ఐపీఆర్ చెయిర్ సెంటర్ ఫర్ ఐపీఆర్ ప్రారంభించిన మేసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు (మూక్స్)లకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఏయూలో చదువుతున్న 3,500 మందికి పైగా పీజీ విద్యార్థులు దరఖాస్తు చేశారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి స్వయంగా కోర్సును విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి రెండు క్రెడిట్‌లు, ఇ సర్టిఫికెట్ అందిస్తారు. ఆసక్తి గలవారు 9599229217, 8333933425లో సంప్రదించాలి.

ఎయిర్‌పోర్టు సలహామండలి సభ్యుడుగా పవన్ కార్తీక్



రాజారెడ్డికి నియామక పత్రం అందిస్తున్న పవన్

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం సలహా మండలి సభ్యుడుగా ఎం.వి.పవన్‌కార్తీక్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డికి ఆయన అందించారు. తనను ఎయిర్‌పోర్టు సలహా మండలి సభ్యుడిగా నియమించినందుకు ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోర్టు పెన్షనర్లకు పెరిగిన డీఏ

మర్రిపాలెం: హార్బర్ అండ్ పోర్టు పింఛనర్లకు డీఏ పెరిగినట్టు పింఛనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు. మాధవధారలోని కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అక్టోబరు నుంచి డిసెంబరు నెల వరకు క్లాస్ 1,2 ఉద్యోగులకు, పింఛనర్లకు 4.5 శాతం, క్లాస్ 3,4 ఉద్యోగులకు 4 శాతం డీఏ పెరిగినట్టు పేర్కొన్నారు. పెరిగిన కరువుభత్యం ఈ నెల పెన్షన్‌తో కలిసి వస్తుందన్నారు. వేజ్ రివిజన్ సమావేశం నవంబర్ 6న న్యూఢిల్లీలో జరుగుతుందని తెలిపారు.

రేపటి నుంచి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్

విశాఖ స్పోర్ట్స్: విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో 34వ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. అండర్ 14, 17, 19 కేటగిరిల్లో జరగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో బాలురు 23, బాలికలు 19 జట్లు పోటీపడనున్నాయి. ఈ సందర్భంగా బీవీకే కళాశాలలో బుధవారం జరిగిన సమావేశంలో కళాశాల చైర్మన్ పీఎస్ ఆవధాని మాట్లాడుతూ ఏయూ మైదానం, చంద్రంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, సీతమ్మధార శ్రీప్రకాష్‌స్కూల్, పోలీస్ బారెక్స్ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయన్నారు. పోటీలు ఏయూలో రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చాంపియన్‌షిప్ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● సొంతింటి కల.. నెరవేరిన వేళ

నేడే స్వగృహ ప్రవేశం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఇళ్లు



లొడగలవానిపాలెంలో నిర్మించిన జగనన్న కాలనీ ఇళ్లు

గృహ ప్రవేశ ఆహ్వానపత్రిక



స్థలం : ఆనందపురం మండలం లొడగలవాని పాలెం గ్రామం
సమయం : అక్టోబర్ 12వ తేదీ ఉదయం 9 గంటలకు
ఆహ్వానించువారు : 102 పేద కుటుంబాలు
ప్రారంభోత్సవం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా..
బంధుమిత్రులు : మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు

విశాఖపట్నం జిల్లా ప్రజలందరికీ ఇదే మా ఆహ్వానం..
ఇన్నాళ్లూ.. సొంత ఇల్లు లేక కుటుంబాలతో
అనేక ఇబ్బందులు పడిన మాకు..
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గూడు
కల్పించింది. కలల సౌధాన్ని నిర్మించుకొనే బృహత్తర
అవకాశాన్ని అందించింది. ఇంటి స్థలం నుంచి.. నిర్మాణం
పూర్తయ్యేంత వరకూ ప్రభుత్వం చేదోడువాదోడుగా
నిలుస్తూ.. మా సొంతింటి కలని సాకారం చేసింది.
బాడుగలు కట్టుకోలేక.. సంపాదన సరిపోక.. కుటుంబ పోషణే కష్టమ
వుతున్న తమకు.. కలలో కూడా ఊహించని ఇంటిని ఆస్తిగా
సీఎం వైఎస్ జగన్ అందించారు. ఒక్కొక్కరికీ స్థలం విలువతో కలిపి
దాదాపు రూ.50 లక్షల ఆస్తిని కానుకగా ఇచ్చారు.
ఈ సంతోష సమయంలో.. మేమంతా సామూహిక గృహ ప్రవేశాలకు
మిమ్మల్నందర్నీ ఆహ్వానం పలుకుతున్నాం. గురువారం మంచి
ముహూర్తం ఉంది కాబట్టి.. ఆ రోజునే మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్
రెడ్డి వర్చువల్‌గా అందిస్తున్న ఆశీస్సులతో సామూహిక గృహ ప్రవేశాలు చేస్తున్నాం.
పేద మనసుల ఆహ్వానాన్ని మన్నించి..
మీరంతా వచ్చి ఆశీర్వాదం అందించాలని కోరుతున్నాం.

● 102 ఇళ్లల్లో ప్రవేశాలకు ఏర్పాట్లు
● సుందరంగా లొడగలవాని పాలెం కాలనీ

సాక్షి, విశాఖపట్నం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సామూహిక గృహ ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 5 లక్షల గృహప్రవేశాలు గురువారం జరగనున్నాయి. కోర్టు కేసుల కారణంగా జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని.. నిర్మాణ పనులను వేగవంతం చేశారు. మోడల్ కాలనీగా ఆనందపురం మండలం ఎల్‌వీ కాలనీని ఎంపిక చేశారు. కలెక్టర్ డా.మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు గృహ నిర్మాణాలకు సంబంధించిన పనులపై ఆరా తీశారు. హౌసింగ్ పీడీ శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్మాణ పనులు చురుగ్గా సాగాయి. మొత్తం మూడు ఎకరాల విస్తీర్ణంలో 102 ఇళ్లను నిర్మించారు. 5 లక్షల గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సామర్లకోట నుంచి సీఎం వైఎస్ జగన్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కాలనీని వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించనుండగా.. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.



లొడగలవానిపాలెం కాలనీ

● పరవాడ మండలం వెన్నలపాలెంలో నిర్మించిన జగనన్న గృహసముదాయంలో 173 ఇళ్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు.

సకల సదుపాయాలతో ప్రారంభం

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేశారు. పూర్తయిన గృహాలకు పెయింటింగ్స్ కూడా పూర్తి చేశారు. సామూహిక గృహ ప్రవేశాల రోజున లబ్ధిదారులకు తాళాలు కూడా అందజేయనున్నారు. జగనన్న కాలనీల్లో ఇంటింటికీ తాగునీరు అందించే బాధ్యతను నీటి సరఫరా విభాగం, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చే పనిలో ఈపీడీసీఎల్, కాలనీల్లో అంతర్గత రహదారులు, కాలువల నిర్మాణం ఇతర పనుల బాధ్యతల్ని వీఎంఆర్‌డీఏ, పంచాయతీరాజ్ విభాగాలకు అప్పగించగా.. అన్ని పనులను నిర్దిష్ట సమయంలోనే పూర్తి చేశారు.

లొడగలవానిపాలెం కాలనీ స్వరూపం

మొత్తం స్థలం : 3 ఎకరాలు	మొత్తం నిర్మించిన ఇళ్లు 102
మొత్తం భూమి విలువ : రూ.3 కోట్లు	ఒక్కొక్కరికీ కేటాయించిన స్థలం 72 గజాలు
మొత్తం లబ్ధిదారులు : 102 మంది	ఒక్కో ఇంటికి రాయితీ రూ.1.80 లక్షలు

ఎస్‌హెచ్‌జీ ద్వారా ఇచ్చిన మొత్తం రూ.35 వేలు
ప్రభుత్వం అందించిన మొత్తం రూ. 2.15 లక్షలు
మొత్తం ఇళ్లకు అందించిన మొత్తం రూ. 219.3 లక్షలు

మౌలిక సదుపాయాలకు చేసిన ఖర్చు

చదును చేసేందుకు రూ.3 లక్షలు	కాలనీల్లో వీఎంఆర్‌డీఏ సహకారంతో రోడ్లు కోసం రూ.33.5 లక్షలు
నీటి సరఫరా కోసం రూ. 27 లక్షలు	జగనన్న కాలనీ వెల్‌కమ్ ఆర్చ్ రూ.4.15 లక్షలు
విద్యుత్ సౌకర్యం కోసం రూ.29 లక్షలు	

ప్రతి ఇంటికీ ఇంకుడు గోతుల కోసం రూ.6 లక్షలు
మొత్తంగా మౌలిక సదుపాయాల కోసం రూ.6.25 కోట్లు
ఒక్కొక్కరికీ అందిస్తున్న ఆస్తి విలువ రూ.50 లక్షలు

మహిళల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం



మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

దొండపర్తి : మహిళల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం విశాఖకు వచ్చిన ఆయన పోలీస్ అతిథి గృహంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణతో పాటు అనకాపల్లి, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, మిస్సింగ్ సంబంధిత కేసుల్లో జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. పొక్సో కేసులపై ఆరా తీశారు. ఎక్కువ కేసులు ఉన్న రౌడీషటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతర నిఘా పెట్టాలని చెప్పారు. ప్రయారిటీ కేసులలో కోర్టులో ట్రయిల్‌కు వచ్చి కన్విక్షన్ పడేంత వరకూ ఉన్నతాధికారులు ప్రతి కేసును పర్యవేక్షించాలని ఆదేశించారు.

● ప్రతి ఉన్నతాధికారి 5 కేసులు మోనటరింగ్ చేయాలని, కేసుల విషయంలో క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడుతూ ఉండాలన్నారు. ప్రతి నెలా కన్విక్షన్ పడుతున్న కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపించాలని తెలిపారు.
● రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రమాదాల కారణంగా మరణాల శాతం తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు.
● గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాకు పూర్తి అడ్డుకట్ట వేయాలని, అధికారులను ఆదేశించారు.
● క్రైం రేట్ తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలన్నారు. రాత్రి విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ట్యాబ్‌లో తమ లొకేషన్ తెలిసే విధంగా ఉండాలన్నారు.
● ఎస్‌ఈబీ బృందాలుగా ఏర్పడి నగరంలో ఉన్న విద్యాసంస్థల వద్ద నిఘా పెట్టాలని, ప్రధాన ప్రాంతాల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు.
● సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు. పలు కొత్త సాఫ్ట్‌వేర్లను తీసుకొని వినియోగించాలని సూచించారు.
● లోక్ అదాలత్‌లో గతంలో కంటే మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
● పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, కేసు పెండింగ్ ఉండడానికి గల కారణాలు తెలుసుకొని సదరు కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.
● క్రైమ్, ట్రాఫిక్ విభాగాల పనితీరు సమీక్షించారు. కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలు తెలుసుకున్నారు.

గుడివాడ గురునాథరావుకు ఘన నివాళి



గురునాథరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు బూడి, అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకట కుమారి, కోలా గురువులు, కేకే రాజు

సీతమ్మధార : దివగంత నేత గుడివాడ గురునాథరావు జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. అతని తనయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల గురునాథరావు విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో రాజకీయంగా గుడివాడ గురునాథరావు మంచి పేరు ప్రఖ్యాతులు సాధించారని గుర్తు చేసుకున్నారు. ఆయన వద్ద అనేక మంది శిష్యరికం చేశారని, వారిలో తాను కూడా ఒకడినని అన్నారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ తన తండ్రి ఆలోచనలతో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో సమస్యల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



మహిళలతో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

భీమునిపట్నం: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జోనల్, మండల, జిల్లా స్థాయి అధికారులతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కొన్ని సమస్యలు జిల్లా స్థాయి అధికారులు పరిష్కరించాల్సి ఉన్నందున వారిని కూడా అందుబాటులో వుంచామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, అందరికీ మేలు చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజల నుంచి అందిన వినతులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమస్యల పరిష్కారంపై మరోసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 124 మంది నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధించి 90 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్‌డీవో ఎస్.భాస్కర రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో వెంకటరమణ, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ

అల్లిపురం: న్యాయవాదుల సంక్షేమ నిధి పేరిట ప్రతి పిటిషన్‌పై రూ.20 స్టాంపు రూపంలో చెల్లించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ జారీచేసిన ఆదేశాలను వ్యతిరేకిస్తూ గురు, శుక్రవారాల్లో విధులు బహిష్కరించాలని విశాఖపట్నం న్యాయవాదుల సంఘ సభ్యులు నిర్ణయించినట్లు అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తెలిపారు. రూ.20 వెల్ఫేర్ స్టాంపు అతికించాలన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని హైకోర్టులో రిట్ దాఖలు చేయడానికి జిల్లా కోర్టు లైబ్రరీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానించినట్లు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో గల అన్ని న్యాయస్థానాలతోపాటు,వినియోగదారుల ఫోరాలు, సీబీఐ న్యాయస్థానం, టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌తో సహా అన్ని న్యాయస్థానాల్లో పూర్తి స్థాయిలో విధుల బహిష్కరణ కొనసాగుతుందని తెలిపారు.

ఎలక్ట్రిక్ బస్సులొచ్చేస్తున్నాయ్!

● మూడు నెలల్లో రోడ్లపైకి రాక..
● విశాఖకు తొలిదశలో 100, మలివిడత 100 బస్సులు
● సిటీ సర్వీసులుగానే నడిపేందుకు సన్నాహాలు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగర రోడ్లపై విద్యుత్ (ఎలక్ట్రిక్) బస్సులు పరుగులు పెట్టే రోజులు సమీపిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే తిరుపతి నుంచి కొండపైకి విద్యుత్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే నెల్లూరు–తిరుపతిల మధ్య ఇవి నడుస్తున్నాయి. రాష్ట్రంలోని మిగిలిన పెద్ద నగరాల్లోనూ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు కొన్నాళ్లుగా సన్నాహాలు జరుగుతున్నాయి. తొలిదశలో వెయ్యి విద్యుత్ బస్సులను కొనుగోలు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకోసం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. విశాఖ నగరానికి 200 ఎలక్ట్రిక్ బస్సులు అవసరమవుతాయని ఆర్టీసీ జిల్లా అధికారులు యాజమాన్యానికి ఇదివరకే ప్రతిపాదనలు పంపారు. ఈ-బస్సుల కొనుగోలు మొదలవుతున్న నేపథ్యంలో.. మరో మూడు నెలల్లో వీటిని అందుబాటులోకి తీసుకొస్తామని తాజాగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నగరమే కాదు.. త్వరలోనే కార్యనిర్వాహక రాజధానిగా మారబోతున్న విశాఖకు తొలి విడతలో వీటిలో కనీసం వంద బస్సులనైనా కేటాయిస్తారని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి. మలిదశలో మరో వంద విద్యుత్ బస్సులను ఇస్తారని ఆశాభావంతో ఉన్నాయి.

సిటీ సర్వీసులుగానే..

విశాఖకు కేటాయించే ఎలక్ట్రిక్ బస్సులను తొలుత సిటీ సర్వీసులుగానే నడపనున్నారు. బ్యాటరీతో నడిచే ఈ-బస్సులు గతంలో 150 కిలోమీటర్లు తిరగడానికి మాత్రమే చార్జింగ్ సరిపోయేది. క్రమంగా వీటిలో సాంకేతికతను అభివృద్ధి చేస్తుండడంతో ఇప్పుడు వాటి మైలేజి మరింత పెరిగే అవకాశం ఉంది. నగర పరిధిలో ప్రస్తుతం సిటీ బస్సులు రోజుకు 250 నుంచి గరిష్టంగా 400 కిలోమీటర్ల వరకు తిరుగుతున్నాయి. తొలుత వచ్చే విద్యుత్ బస్సులను తక్కువ కిలోమీటర్ల రూట్లలో తిప్పాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. మలి విడతలో రానున్న ఎలక్ట్రిక్ బస్సులను అప్పటి పరిస్థితులకనుగుణంగా వివిధ సిటీ రూట్లలో నడపనున్నారు. కొన్నాళ్ల తర్వాత సమీపంలోని పట్టణాలకు రెగ్యులర్ సర్వీసులుగా నడపాలని వీరు భావిస్తున్నారు.

సింహపురి, గాజువాక డిపోలు ఎంపిక

విద్యుత్ బస్సుల కోసం నగర పరిధిలోని సింహపురి, గాజువాక, వాల్తేరు డిపోలను తొలుత సిఫార్సు చేశారు. చివరకు వీటిలో సింహపురి, గాజువాకలను దాదాపు ఖరారు చేశారు. ఈ డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులకు అవసరమయ్యే చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తారు. విశాఖలో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కోసం సింహపురి లేఅవుట్‌లో డిపోతో పాటు గ్యారేజీని కూడా ఏర్పాటు చేయనున్నారు.

డీజిల్ బస్సుల స్థానంలో ఈ-బస్సులు

విశాఖ నగర పరిధిలోని ఏడు డిపోల్లో ప్రస్తుతం 525 సిటీ బస్సులున్నాయి. వాహనాల తుక్కు విధానంలో భాగంగా 15 ఏళ్లు దాటిన బస్సులను సేవల నుంచి తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన డీజిల్ బస్సుల స్థానంలో దశల వారీగా ఈ-బస్సులను సమకూరుస్తారు. విశాఖ జిల్లా ప్రజా రవాణా విభాగంలో ఈ సంవత్సరం 35 ఆర్టీసీ సిటీ బస్సులను తొలగించారు. వచ్చే ఏడాది ఆఖరు నాటికి మరో 150 వరకు సిటీ బస్సులు 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకోనుండడంతో వీటిని కూడా సేవల నుంచి తప్పించనున్నారు. విశాఖకు కేటాయించే ఎలక్ట్రిక్ బస్సులను తొలగించిన డీజిల్ బస్సుల స్థానంలో దశల వారీగా భర్తీ చేస్తామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. డీజిల్ బస్సులు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. భవిష్యత్తులో డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులు అందుబాటులోకి వస్తే నగరంలో కొంతవరకు కాలుష్య నియంత్రణకు వీలు పడుతుందని తెలిపారు.

మారుతీనగర్‌లో భారీ చోరీ

- రూ.25 లక్షల విలువ చేసే వజ్రాలు, బంగారు ఆభరణాల చోరీ

సీతమ్మధార : ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీ నగర్‌లో భారీ చోరీ జరిగింది. బాలయ్య శాస్త్రి లే అవుట్, మారుతీ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఎంవీవీ సత్య హోమ్స్‌లో సీహెచ్.సత్యనారాయణరాజు, భార్య సింధు నివసిస్తున్నారు. మంగళవారం ఉదయం భార్య నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో పుట్టింటికి వెళ్లారు. భర్త పనిమీద బయటకు వెళ్లి, రాత్రి ఇద్దరూ ఇంటికి చేరుకుని తలుపులు వేసుకుని నిద్రించారు. బుధవారం ఉదయం భార్య చెవిదిద్దుల కోసం కబోర్డులో చూడగా అందులోని 250 గ్రాముల వజ్రాలు, బంగారు ఆభరణాలు కనిపించలేదు. వీటి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీంతో వెంటనే ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులకు సమాచారమివ్వడంతో సంఘటన స్థలానికి క్రైం డీసీపీ నాగన్న, ఏడీసీపీ గంగాధర్, ఏసీపీ వెంకటరావు, సీఐ ఎర్రంనాయుడు, ఎస్‌ఐ అప్పారావుతోపాటు డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం పరిశీలించారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

బాధితుడు సత్యనారాయణరాజు ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని తెలిసింది.

పూర్తిస్థాయిలో యూబీఏ కార్యక్రమాలు

ఏయూ క్యాంపస్: ఉన్నత్ భారత్ అభియాన్ (యూబీఏ) కార్యక్రమాన్ని ఏయూ అనుబంధ కళాశాలల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో యూబీఏ రీజినల్ కోఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్ - ఏయూ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవార్డులను ప్రధానం చేశారు. పలు విభాగాల్లో ఉత్తమ కళాశాలలుగా ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ఉత్తమ ఏక్టివిస్ట్‌గా ఏయూ - ఐఏఎస్‌ఈ, ఉత్తమ మోటివేటర్‌గా జి.ఎం.ఆర్.ఐ.టి, ఉత్తమ ఇనీషియేటర్‌గా ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉత్తమ ఎస్‌ఈజీ ప్రపోజనల్‌గా అనిట్స్ కళాశాల, ఉత్తమ హెల్పర్‌గా బాలాజీ డిగ్రీ కళాశాల, స్పెషల్ జ్యూరీ జీఎస్ఎల్ దంత కళాశాల, సర్ సి.ఆర్.ఆర్ మహిళా కళాశాల అధ్యాపకులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, యూబీఏ నోడల్ అధికారి ఆచార్య జి.నాగరాజు, రీజినల్ సమన్వయకర్త బి.పావని తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి అవార్డులు సాధించిన వారితో ఏయూ వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

‘అనిత... నోరు అదుపులో పెట్టుకో..’

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఏకవచనంతో విమర్శిస్తూ, మంత్రి రోజాపై అసభ్యకరంగా మాట్లాడుతున్న టీడీపీ నాయకురాలు అనిత నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రోజారాణి అన్నారు. ఎండాడలో గల పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి అనితకు లేదన్నారు. మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండారు సత్యనారాయణను వెనకేసుకురావడం మహిళా లోకానికే సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబుకు త్వరలో జగన్ మోహన్‌రెడ్డి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తుందో తెలియని అనితకు వైఎస్సార్‌సీపీ మంత్రులను విమర్శించే స్థాయి లేదన్నారు. ప్రస్తుతం ప్రజా బలం లేకపోవడంతో చంద్రబాబు దత్తపుత్రుడి సహకారంతో అధికారంలోకి వద్దామని టీడీపీ నాయకులు కలలుకంటున్నారని ఎద్దేవా చేశారు. ఇకనుంచైనా అనిత నోరు అదుపులో పెట్టుకోకపోతే ఇంటికొచ్చి బుద్ధి చెప్పాల్సి వస్తుందని రోజారాణి హెచ్చరించారు. ఆమెతోపాటు సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు రాజేశ్వరి ఉన్నారు.



మాట్లాడుతున్న రోజారాణి

అండర్ - 17 బాలబాలికల త్రోబాల్ పోటీలకు ఎంపిక

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్ - 17 బాలబాలికల త్రోబాల్ పోటీల ఎంపిక ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాషరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల పిల్లలకు టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలతోపాటు ఒత్తిడిని తట్టుకునే శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ గెలుపు, ఓటముల కంటే క్రీడాస్ఫూర్తి అలవరచుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులకు మానవత్వ సేవా ట్రస్టు అధ్యక్షుడు మడక అప్పలరాజు జ్ఞాపికలు అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి సుమారు 250 మంది బాలికలు, 250 మంది బాలురు పోటీల్లో పాల్గొన్నారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, చిత్రాడ వెంకటరమణ, జెర్రిపోతుల ఈశ్వరరావు, దుగ్గపు దానప్పలు, ముద్దపు దామెదర్, బోండా గోవిందరాజులు, పాఠశాల పీడీ మన్నాజీ, పీటీ పీఈటీ పీడీ అసోసియేషన్ ప్రెసిడెంట్ అప్పలరాజు, జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 13వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. హనీ గ్రూప్, ఫ్లిప్‌కార్ట్, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్, వరుణ్ మోటార్స్, హెటిరో ల్యాబ్స్, జయభేరి ఆటోమోటివ్స్, గేమ్స్ సాఫ్ట్, రక్షిత్ బిజినెస్ సర్వీసెస్, ఎంఏఎస్ మెరైన్ సర్వీసెస్, ఆస్ట్రోటెక్ స్టీల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 416 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. రిలేషన్‌షిప్ మేనేజర్, సేల్స్ మేనేజర్, డెలివరీ బాయ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ ఆఫీసర్, టెలికాలర్స్, పోర్ట్ సర్వేయర్స్, మెషీన్ ఆపరేటర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, బీ, డీ.ఎం ఫార్మసీలో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని పేర్కొన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.12,000 నుంచి రూ.28,000ల వరకు ఉంటుందన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు రావాలని కోరారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పెదగంట్యాడ: మండలంలోని సిద్ధేశ్వరం ఆర్.హెచ్.కాలనీకి చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సిద్ధేశ్వరం ఆర్.హెచ్.కాలనీలో యన్నంరెడ్డి శ్రీనివాస్ (19) తల్లి, ఇద్దరు తమ్ముళ్లతో కలిసి నివసిస్తున్నాడు. తండ్రి మృతి చెందడంతో స్థానికంగా ఉండే ఓ టెంట్ హౌస్‌లో పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని దల్లివానిపాలెం జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి పలువురు యువకులు మండపం పనులు చేపట్టారు. అనంతరం వాళ్లంతా అక్కడే ఉన్న త్రిశక్తి ఎంటర్‌ప్రైజస్ వద్ద భోజనాలు చేస్తున్నారు. అదే సమయంలో డయల్ 100కు సిద్ధేశ్వరానికి చెందిన ఓ వివాహిత తన భర్త వేధిస్తున్నాడంటూ కాల్ చేయడంతో న్యూపోర్టు పోలీసులు స్పందించారు. వెంటనే జీపులో వెళ్తుండగా అర్ధరాత్రి దాటిన తర్వాత సిద్ధేశ్వరంలో కొంతమంది యువకులు ఉండడాన్ని గుర్తించారు. వెంటనే సైరన్ మోగించారు. దీంతో భయంతో ఆ యువకులు అక్కడి నుంచి పరుగులు తీశారు. అందులో ఉన్న శ్రీనివాస్ కూడా పరిగెత్తి పడిపోయాడు. గాయపడిన ఆ యువకుడిని వెంటనే గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆ యువకుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. దీనిపై న్యూపోర్టు పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.



యన్నంరెడ్డి శ్రీనివాస్ (ఫైల్)

లింగ నిష్పత్తి సమానంగా ఉండాలి

దొండపర్తి: బాలబాలికల నిష్పత్తి సమానంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రతి 1000 మంది బాలురకు 948 బాలికలు ఉన్నారని, ఈ నిష్పతి సమానంగా ఉండేలా చూడాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అలాగే అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలు అన్ని రంగాల్లోను ముందున్నారని తెలిపారు. జిల్లా విస్తరణ ప్రచారణ అధికారి బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్షకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే వ్యత్యాసాలు తొలగిపోతాయని సూచించారు. ఈ ర్యాలీలో ప్రోగ్రాం అధికారులు బి.నాగేశ్వరరావు, ఎస్.బేగం, రవి శంకర్, బి.నాగభూషణం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తోటగరువు దరి శాంతినగర్‌లో మలిశెట్టి రామకృష్ణ ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆ మహిళకు ముగ్గురు కుమార్తెలు. ఆమె కూలి పనులు చేస్తూ వారిని పోషించుకుంటుంది. రెండు రోజుల క్రితం రామకృష్ణ ఆమె లేని సమయం చూసుకొని ఇంటికి వెళ్లాడు. పదేళ్ల వయసు గల ఆమె పెద్ద కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. గమనించిన ఆరేళ్ల చిన్న కుమార్తె ఇంటి నుంచి బయటకు వచ్చి స్థానికులకు విషయం చెప్పింది. దీంతో స్థానికులు రామకృష్ణను పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న ఆ బాలిక తల్లి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- ఈ నెల 16, 17, 18, 20, 21న విశాఖపట్నం - విజయవాడ - విశాఖపట్నం (22701 /22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు.
- ఈ నెల 16 నుంచి 22 వరకు మచిలీపట్నం - విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్ రద్దు.
- ఈ నెల 17 నుంచి 23 వరకు విశాఖపట్నం - మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్ రద్దు.

పలు రైళ్ల దారి మళ్లింపు

ఈ కింది రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు - ఏలూరు - విజయవాడ మీదుగా కాకుండా వయా నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా నడుస్తాయని, ప్రయాణికులు మార్పులను గమనించాలని రైల్వే అధికారులు తెలిపారు.

- ధన్‌బాద్‌లో ఈ నెల 15 నుంచి 20 వరకు బయల్దేరే ధన్‌బాద్ - అలెప్పీ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్.
- టాటానగర్‌లో ఈ నెల 20న బయల్దేరే టాటానగర్ - ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్.
- టాటానగర్‌లో ఈ నెల 19న బయల్దేరే టాటానగర్ - యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్.
- హతియాలో ఈ నెల 15, 17న బయల్దేరే హతియా - ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్.
- జసిద్దిలో ఈ నెల 18న బయల్దేరే జసిద్ది - తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్.
- హతియాలో ఈ నెల 16న బయల్దేరే హతియా - ఎర్నాకుళం (22837) ఎక్స్‌ప్రెస్‌లు ఆయా తేదీల్లో మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

మండీ క్రూడ్స్ సీజ్

అక్కిరెడ్డిపాలెం: ఫుడ్ పాయిజినింగ్ జరిగి 13 మంది అస్వస్థతకు గురయ్యేందుకు కారణమైన మండీ క్రూడ్స్ రెస్టారెంట్‌ను జీవీఎంసీ సీజ్ చేసింది. బుధవారం గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకలోని వంటిల్లు వద్ద గల మండీ క్రూడ్స్‌పై ఇప్పటికే గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. అస్వస్థతకు గురైన 13 మంది సురక్షితంగా బయటపడటంతోపాటు వారి ఫిర్యాదు మేరకు మండీ క్రూడ్స్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీలోని ఫుడ్ అండ్ సేఫ్టీ విభాగం అధికారులు బుధవారం సీజ్ చేశారు.

శ్రామిక్ యూనియన్ డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్‌గా ఆదినారాయణ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్‌గా పి.ఆదినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌లో ఆదినారాయణను సీనియర్ డివిజనల్ ఇంజనీర్(జి) ఎస్.ఎస్.ఎన్.మూర్తి, న్యూ కోచింగ్ కాంప్లెక్స్ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ పి.వి.జె.రాజు, ఎఐఆర్‌ఎఫ్ జోనల్ సెక్రటరీ బి.దామోదరరావు పాల్గొన్నారు.

బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి

మురళీనగర్ : పాస్ పోర్టుకోసం దరఖాస్తు చేసుకున్న చిన్నారులకు పుట్టిన తేదీ ధ్రువపత్రం తప్పనిసరిగా సమర్పించాలని విశాఖపట్నం రీజనల్ పాస్ పోర్టు ఆఫీసర్ విశ్వాంజలి ఎం.గైక్వాడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఏడాది అక్టోబరు 1 లేదా తర్వాత జన్మించిన వారి పుట్టిన తేదీ, పుట్టిన స్థలం వివరాలతో కూడిన ధ్రువపత్రం సమర్పించాలని పేర్కొన్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో హై అలర్ట్

- రెండు రోజులుగా ప్రత్యేక తనిఖీలు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు ఆర్‌పీఎఫ్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు సంయుక్తంగా రెండు రోజులుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికుల సామగ్రి, బ్యాగులు తనిఖీ చేస్తున్నారు. అయితే ఈ తనిఖీలు ఎందుకు చేస్తున్నారో అర్థం కాక ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. రైల్వే అధికారులు మాక్ డ్రిల్‌లో భాగంగా తనిఖీలు చేపట్టారని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. సాగర్ కౌచ్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నామని ఆర్‌పీఎఫ్ పోలీసులు చెబుతున్నారు. విద్రోహ శక్తులు ఎవరైనా స్టేషన్‌లోకి చొరబడుతున్నారా..?, వారు ఏవిధంగా వస్తున్నారన్న దానిపై స్టేషన్‌కు అన్నివైపులా పహారా కాశారు. ఈ తనఖీలు గురువారం కూడా చేపట్టనున్నారు.



సింహాచలం ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు